


RNI No. TGTEL/26/A1458

# విశ్వంవాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY






SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 1 సంచిక : 10 అమీర్‌పేట్ ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ ఆదివారం 19 ఏప్రియల్ 2026 పేజీలు : 4 వెల : 2/-

దక్షిణాది రాష్ట్రాలను ఒప్పించే బాధ్యత

# నేను తీసుకుంటా..

**2023 నాటి మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెడితే ఇండియా కూటమి మద్దతిస్తుందని హామీ**
**మహిళా రిజర్వేషన్ బిల్లుకు కాంగ్రెస్ వ్యతిరేకమన్నది అబద్ధమన్న సీఎం రేవంత్ రెడ్డి**
**డీలిమిటేషన్ పేరుతో బీజేపీ శాశ్వతంగా అధికారంలో ఉండాలని కుట్ర చేసిందని ఆగ్రహం**



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** 2023 నాటి మహిళా రిజర్వేషన్ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెడితే, దక్షిణాది రాష్ట్రాలను ఒప్పించే బాధ్యతను తాను తీసుకుంటానని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల లోపు నాటి మహిళా రిజర్వేషన్‌ను అమలు చేస్తే మద్దతిచ్చేందుకు తాము సిద్ధంగా ఉన్నామని అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు కాంగ్రెస్ వ్యతిరేకమన్నది అబద్ధమని పేర్కొన్నారు. ప్రస్తుతం ఢిల్లీ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం ఉదయం కాంగ్రెస్ పెద్దలను కలిసి బిల్లు వీగిపోయినందుకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, 131వ రాజ్యాంగ సవరణ బిల్లు లోక్ సభలో వీగిపోవడంతో దేశానికి పెద్ద ప్రమాదం తప్పిందని వ్యాఖ్యానించారు. బిల్లు వీగిపోవడం రాజకీయ ఓటమి కాదని, బీజేపీ విధానాలకు జరిగిన ఓటమి అని అభివర్ణించారు. ఎన్డీయే మూడు బిల్లుల పేరుతో డీలిమిటేషన్ అమలుకు కుట్ర చేసిందని ఆరోపించారు. దక్షిణ భారతదేశానికి జరిగే అన్యాయాన్ని అడ్డుకుంటామని అన్నారు. మహిళా రిజర్వేషన్లను చిన్న సవరణలతో అమలు చేయవచ్చని అన్నారు. బీజేపీకి 400కు పైగా సీట్లు వస్తే రాజ్యాంగాన్ని మార్చేదని ఆరోపించారు. మహిళా రిజర్వేషన్లకు తాము వ్యతిరేకం కాదని పునరుద్ఘాటించారు. సోమవారం

హర్మూజ్‌ని దాటేందుకు యత్నించిన

## భారతీయ నౌకలపై కాల్పులు




**విశ్వం వాయిస్ న్యూస్ :** హర్మూజ్ జలసంధిని తెరిచే ఉంచుతామని ప్రకటించిన మరుసటి రోజే.. మళ్లీ దానిని మూసివేస్తున్నట్లు ఇరాన్ ప్రకటించింది. ఈ నేపథ్యంలో హర్మూజ్ జలసంధిని దాటేందుకు యత్నించిన రెండు నౌకలపై కాల్పులు జరిగినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ఈ నౌకలు భారతీయ జెండాలతో ప్రయాణిస్తున్నట్టుగా తెలిసింది. హర్మూజ్ జలమార్గం ద్వారా ప్రయాణిస్తున్న రెండు నౌకలపై ఐఆర్‌జీసీకి సంబంధించిన గన్ బోట్‌లు కాల్పులు జరిపాయి. అయితే.. ట్యాంకర్లు, అందులోని సిబ్బంది సురక్షితంగా ఉన్నారని యునైటెడ్ కింగ్‌డమ్ మారిటైమ్ ట్రేడ్ ఆపరేషన్స్ సెంటర్ వెల్లడించింది. కాల్పుల ప్రభావం తెలియాల్సి ఉంది. అమెరికాతో జరిగిన చర్చల మిగతా .. 2లో..

స్వార్థ రాజకీయాల కోసం

## నారీశక్తిని అడ్డుకున్నారు

**భారత దేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ**



**ఢిల్లీ, విశ్వం వాయిస్ న్యూస్ :** భారత నారీశక్తి ఎదగకుండా విపక్షాలు అడ్డుకున్నాయని ప్రధాని మోదీ ఆక్షేపించారు. భారత మహిళల కలలను ధ్వంసం చేశారని విమర్శించారు. 131వ రాజ్యాంగ సవరణ బిల్లు లోక్‌సభలో వీగిపోయిన నేపథ్యంలో.. దేశ ప్రజలను ఉద్దేశించి శనివారం మోదీ ప్రసంగించారు. దేశ హితమే తమకు అత్యంత ముఖ్యమని, కొందరికి మాత్రం దేశం కంటే రాజకీయాలే ముఖ్యమని విమర్శించారు. దేశ హితం కోసం, నారీ శక్తి హితం కోసం బిల్లు తెచ్చామన్న ఆయన.. మహిళా శక్తిని ఈ దేశం ఇంకా చూడాల్సి ఉందన్నారు. స్వార్థ రాజకీయాల కోసం నారీ శక్తిని అడ్డుకున్నారని అన్నారు. " మహిళా బిల్లును కాంగ్రెస్, డీఎంకే, టీఎంసీ అడ్డుకున్నాయి. అలాంటి కుటుంబ పార్టీలు మహిళలను ఎదగనీయవు. ఆ పార్టీలు ఓడించింది బిల్లును కాదు.. మహిళా శక్తిని. తమకు జరిగిన అన్యాయాన్ని మహిళలు ఎప్పటికీ మర్చిపోరు. కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు కలిసి మహిళల ఆత్మగౌరవాన్ని దెబ్బతీశాయి. మహిళా బిల్లును అడ్డుకున్న పార్టీలకు తప్పకుండా శిక్ష పడుతుంది.

**ఆ పాపం వదిలిపెట్టదు**

మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుకున్న పాపం వారిని వదిలిపెట్టదు. అన్ని విషయాలను మహిళలు గమనిస్తూనే ఉన్నారు. మహిళలు తమ హక్కు కోసం 40 ఏళ్లుగా పోరాడుతున్నారు. రిజర్వేషన్ల కోసం ఎందరో మహిళలు పోరాటం చేశారు. ఎంతో నిజాయతీతో తెచ్చిన బిల్లును ప్రతిపక్ష నేతలు అడ్డుకున్నారు. మహిళా బిల్లు క్రెడిట్ తీసుకోవాలని మిగతా .. 2లో..

## 'ఆపరేషన్ సేఫ్ స్కూల్'

- సజ్జనార్ ఆధ్వర్యంలో 558 దుకాణాలపై దాడులు
- పాఠశాలల సమీపంలో పొగాకు, డ్రగ్స్‌కు వ్యతిరేకంగా పోలీసుల స్పెషల్ డ్రైవ్
- 5 వేల మంది సిబ్బందితో ఏకకాలంలో సోదాలు
- క్షేత్రస్థాయిలో పర్యవేక్షించిన పోలీస్ కమిషన్ సజ్జనార్



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తును చిదిమేస్తున్న డ్రగ్స్ మహమ్మారిని అంతమొందించడమే లక్ష్యంగా హైదరాబాద్ సిటీ పోలీస్ విభాగం శనివారం నగరవ్యాప్తంగా 'ఆపరేషన్ సేఫ్ స్కూల్' పేరుతో భారీ స్పెషల్ డ్రైవ్ నిర్వహించింది. విద్యాసంస్థల పరిసరాలను మిగతా .. 2లో..

కేంద్ర సహాయ మంత్రి జయంత్ చౌదరిని కలిసిన

## ఎంపీ హరీష్ బాలయోగి



**ఢిల్లీ, విశ్వం వాయిస్ న్యూస్ :** ఢిల్లీలోని మంత్రి కార్యాలయంలో కేంద్ర విద్యాశాఖ సహాయ, నైపుణ్యాభివృద్ధి మరియు వ్యవస్థాపక శాఖ మంత్రి జయంత్ చౌదరిని అమలాపురం ఎంపీ గంటి హరీష్ బాలయోగి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అమలాపురం పార్లమెంట్ పరిధిలోని యువతకు విద్యా మరియు నైపుణ్యాభివృద్ధి అవకాశాలను మరింత బలోపేతం చేసే మార్గాలపై చర్చించారు. ఈ మేరకు అవసరమైన చర్యలు తీసుకుంటామని మంత్రి జయంత్ హామీ ఇచ్చినట్లు ఎంపీ హరీష్ తెలిపారు.

## రేవంత్ సభను విజయవంతం చేయాలి

**సోమవారం కాటారంలో సీఎం రేవంత్ కార్యక్రమం**
**మంథని క్యాంప్ కార్యాలయంలో శ్రీధర్ బాబు సమీక్ష సమావేశం**
**కార్యక్రమంలో పాల్గొననున్న ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల : శ్రీధర్‌బాబు**



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'రైతు భరోసా' నిధుల విడుదల కార్యక్రమాన్ని చారిత్రాత్మక విజయవంతం చేయాలని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పిలుపునిచ్చారు. మంథనిలోని తన క్యాంప్ కార్యాలయంలో మంథని, రామగిరి, కమాన్‌పూర్, ముత్తారం, పాలకుర్తి మండలాల కాంగ్రెస్ ముఖ్య నేతలు, ప్రజా ప్రతినిధులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. సోమవారం కాటారంలో జరగనున్న ఈ భారీ బహిరంగ సభకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మిగతా .. 2లో..

21 నౌకలను

## వెనక్కి పంపించాం


**అమెరికా సెంట్రల్ కమాండ్**



**విశ్వం వాయిస్ న్యూస్ :** హర్మూజ్ జలసంధి వద్ద ఇరాన్ పోర్టుల నుంచి నౌకల రాకపోకలపై అమెరికా దిగ్బంధనం కొనసాగుతోంది. దిగ్బంధనం ప్రారంభమైన నాటినుంచి ఇప్పటివరకు 21 నౌకలను వెనక్కి పంపినట్లు తాజాగా అమెరికా సెంట్రల్ కమాండ్ పేర్కొంది. అది ఈ మేరకు ఎక్స్‌లో పోస్టు పెట్టింది. అమెరికాకు చెందిన గైడెడ్ మిసైల్ డిస్ట్రాయర్ యూఎస్ఎస్ మైఖేల్ మర్ఫీ అరేబియా సముద్రంలో చురుకుగా గస్తీ కాస్తోందని సెంట్రల్ కమాండ్ తెలిపింది. ఇరాన్ పోర్టుల్లోకి రావడానికి, బయటకు వెళ్లేందుకు ప్రయత్నిస్తోన్న నౌకలను తాము సమర్థవంతంగా అడ్డుకుంటున్నట్లు వెల్లడించింది. దిగ్బంధనం ప్రారంభమైన నాటినుంచి తమ ఆదేశాలకు కట్టుబడి ఇప్పటివరకు 21 నౌకలు వెనుదిరిగాయని తెలిపింది. కాగా, హర్మూజ్ విషయంపై అమెరికా- ఇరాన్‌ల మధ్య మరోసారి ఉద్రిక్తతలు మిగతా .. 2లో..

## ఏఐతో ఆందోళనలు వద్దు

**సీజేఐ జస్టిస్ సూర్యకాంత్**



**విశ్వం వాయిస్ న్యూస్ :** కృత్రిమ మేధ అన్ని రంగాల్లోకి శరవేగంగా విస్తరిస్తోంది. ఈ నేపథ్యంలో న్యాయవ్యవస్థలో ఏఐ వినియోగంపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ కీలక వ్యాఖ్యలు చేశారు. న్యాయవ్యవస్థలో సాంకేతిక పరిజ్ఞానాన్ని స్వీకరించాలంటే అంతర్గత పరిమితులపై స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలన్నారు. కర్ణాటక స్టేట్ జ్యుడిషియల్ ఆఫీసర్స్ అసోసియేషన్ నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతూ.. ఏఐ గురించి భయపడొద్దని న్యాయాధికారులకు సూచించారు. "టెక్నాలజీ అనేది సలహాలు ఇవ్వడంలో ఉపయోగపడుతుంది. అది మనుషులకు ప్రత్యామ్నాయం కాదు. న్యాయవ్యవస్థలో మిగతా .. 2లో..

## బ్లాక్‌మెయిలింగ్‌కు ప్రయత్నించొద్దు

**ఇరాన్‌కు ట్రంప్ హెచ్చరిక**



**విశ్వం వాయిస్ న్యూస్ :** హర్మూజ్ జలసంధిని మళ్లీ మూసివేస్తున్నట్లు ఇరాన్ ప్రకటించడంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పందించారు. జలసంధిపై మాట మార్చడం ద్వారా తమను బ్లాక్‌మెయిల్ చేయడానికి ప్రయత్నించొద్దని హెచ్చరించారు. వైట్‌హౌస్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడిన ట్రంప్.. ఇరాన్‌తో సంప్రదింపులు కొనసాగిస్తూనే ఉన్నామన్నారు. ఈ క్రమంలోనే జలసంధిని మళ్లీ మూసివేయాలని చూస్తున్నారని మండిపడ్డారు. ఏళ్లుగా ఇదే తంతు జరుగుతోందని.. కానీ, తమను బ్లాక్‌మెయిల్ చేయలేరని మిగతా .. 2లో..

మీ స్థాయికి

## దిగజారలేను

**ప్రకాష్‌రాజ్‌కు నాగబాబు కౌంటర్**

- పవన్ కల్యాణ్‌పై ప్రకాష్‌రాజ్ చేసిన వ్యాఖ్యలకు గట్టిగా బదులిచ్చిన నాగబాబు
- హిందూమతం నాస్తికత్వాన్ని కూడా గౌరవిస్తుందని నాగబాబు వ్యాఖ్య



**విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రముఖ నటుడు ప్రకాశ్ రాజ్‌పై జనసేన ఎమ్మెల్సీ, మెగా బ్రదర్ నాగబాబు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను ఉద్దేశించి ప్రకాశ్ రాజ్ చేసిన వ్యాఖ్యలకు నాగబాబు ఘాటుగా బదులిచ్చారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదికగా సుదీర్ఘమైన, సూటి వ్యాఖ్యలు చేశారు. "మిమ్మల్ని మీరు క్రిస్టియన్ నాస్తికులు అని చెప్పుకుంటారు. మీ తల్లి అంత్యక్రియల సమయంలో ఆమె నమ్మకాన్ని గౌరవించారు. ఒక కొడుకుగా మీ బాధ్యతను మేం గౌరవిస్తున్నాం. అదే స్ఫూర్తితో కోట్లాది మంది నమ్మకాలను కూడా మీరు గౌరవించాలి" అని నాగబాబు మిగతా .. 2లో..

## దక్షిణాదికి విపక్షాల చారిత్రక ద్రోహం

**దక్షిణాది గౌరవం పేరుతో డ్రామాలు ఆడుతున్నారని విమర్శ**
**రాజకీయ స్వార్థం కోసం చారిత్రక సంస్కరణను అడ్డుకున్నారని మండిపాటు**
**రక్షణ కవచం లాంటి బిల్లును చంపేశారు : బండి సంజయ్**



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** నియోజకవర్గాల పునర్విభజన నేపథ్యంలో దక్షిణాది రాష్ట్రాల ప్రయోజనాలను కాపాడేందుకు కేంద్రం ప్రతిపాదించిన రాజ్యాంగ సవరణ బిల్లును విపక్షాలు అడ్డుకోవడాన్ని కేంద్ర మంత్రి బండి సంజయ్ తీవ్రంగా తప్పుబట్టారు. ఎక్స్ వేదికగా ఆయన స్పందిస్తూ... కాంగ్రెస్, ఇండియా కూటమిపై నిప్పులు చెరిగారు. బయట 'దక్షిణాది గౌరవం' అంటూ డ్రామాలు ఆడే విపక్షాలు, పార్లమెంటులో మాత్రం ఆ ప్రాంత గొంతు నొక్కేలా వ్యవహరించడం వారి ద్వంద్వ నీతికి నిదర్శనమని సంజయ్ మండిపడ్డారు. 2026 తర్వాత జరగబోయే పునర్విభజన వల్ల జనాభా నియంత్రణ పాటించిన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మిగతా .. 2లో..

రాజమండ్రి-విశాఖ మధ్య

## 3, 4వ రైల్వే లైన్ల నిర్మాణం

**ఏపీలో కీలక రైల్వే ప్రాజెక్టుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్**
**రూ. 9,889 కోట్లతో రాజమండ్రి-దువ్వాడ రైల్వే లైన్ల విస్తరణ**
**అన్నవరం, అంతర్వేది వంటి పుణ్యక్షేత్రాలకు మెరుగవనున్న కనెక్టివిటీ**



**విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్‌లో కీలకమైన రైల్వే ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదముద్ర వేసింది. రాజమండ్రి (నిడదవోలు) – విశాఖపట్నం (దువ్వాడ) మధ్య 198 కిలోమీటర్ల మేర మూడో రైల్వే లైను, నాలుగో రైల్వే లైను నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం రూ. 9,889 కోట్లుగా ఉంది. శనివారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన మిగతా .. 2లో..

(మొదటిపేజీ తరువాయి)

### హర్మ్యూజ్‌ని దాటేందుకు యత్నించిన

## భారతీయ నౌకలపై కాల్పులు

సందర్భంగా ఇరాన్ హర్మ్యూజ్ జలసంధిని కొద్ది సమయం పాటు తెరిచి ఉంచింది. ఇరాన్ ఓడరేవుల చుట్టూ అమెరికా తన దిగ్బంధనాన్ని కొనసాగించడంతో ఆ జలసంధిని తిరిగి మూసివేసింది. ఈ ప్రకటన జరిగాక కొన్ని గంటల తర్వాత ఈ ఉద్రిక్త పరిణామాలు చోటుచేసుకోవడం గమనార్హం.

**ఇరాన్ రాయబారికి భారత్ సమన్లు..**

హర్మ్యూజ్ జలసంధిలో భారత జెండాతో కూడిన నౌకలపై దాడులను కేంద్రం తీవ్రంగా పరిగణించినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే భారత్‌లోని ఇరాన్ రాయబారికి విదేశాంగశాఖ సమన్లు జారీ చేసినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి.

### దక్షిణాది రాష్ట్రాలను ఒప్పించే బాధ్యత

## నేను తీసుకుంటా..

ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలను ఏర్పాటు చేసి కేవలం మహిళా రిజర్వేషన్ బిల్లును మాత్రమే పెడితే ఇండియా కూటమి ఏకగ్రీవంగా మద్దతిచ్చేందుకు సిద్ధంగా ఉందని అన్నారు. దక్షిణాది రాష్ట్రాలను ఒప్పించే బాధ్యత తనదేనని తెలిపారు. మహిళా రిజర్వేషన్లలో కూడా ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ కోటాలు ఉండాలని కోరారు. డీలిమిటేషన్ పేరుతో ఉత్తరాది, దక్షిణాది మధ్య చిచ్చుపెట్టవద్దని ముఖ్యమంత్రి కోరారు. డీలిమిటేషన్ పేరుతో లోక్ సభ సీట్లను 850కి పెంచి బీజేపీ శాశ్వతంగా అధికారంలో ఉండాలనే కుట్ర చేసిందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీకి రాజకీయాల కంటే దేశమే ముఖ్యమని రేవంత్ రెడ్డి అన్నారు. మహిళా రిజర్వేషన్లను అమలు చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. ఇందిరాగాంధీ వంటి గొప్ప నేతలు కాంగ్రెస్ పార్టీ తరపున దేశాన్ని నడిపించారని, బీజేపీ నుంచి ఇప్పటి వరకు మహిళ పార్టీ అధ్యక్షురాలు కాలేదని విమర్శించారు. ప్రతి విషయంలో కాంగ్రెస్ పార్టీ మహిళలకు ప్రాధాన్యత ఇచ్చిందని రేవంత్ రెడ్డి అన్నారు.

## 'ఆపరేషన్ సేఫ్ స్కూల్'

వ్యసనరహితంగా తీర్చిదిద్ది, చిన్నారులు పెడదోవ పట్టకుండా చూడాలనే సంకల్పంతో ఈ ప్రత్యేక సోదాలు చేపట్టింది. శాస్త్రీయ అధ్యయనాల ప్రకారం, పొగాకులోని నికోటిన్‌కు అలవాటుపడటమనేది మాదకద్రవ్యాల ఊబిలోకి వెళ్లేందుకు మొదటి మెట్టుగా మారుతోంది. విద్యాసంస్థల సమీపంలో లభించే పొగాకు ఉత్పత్తుల వల్ల విద్యార్థులు క్రమంగా ఆల్కహాల్, డ్రగ్స్ వంటి వ్యసనాలకు బానిసలయ్యే ప్రమాదం ఉంది. ఈ అలవాట్లు చివరకు వారిని చిన్నపాటి నేరాల నుంచి తీవ్రమైన నేరాల వైపు పురికొల్పి, వారి బంగారు భవిష్యత్తును అంధకారం చేస్తున్నాయి. ఈ విషవలయాన్ని ప్రాథమిక దశలోనే తుంచివేసేందుకు పోలీసులు ఈ కఠిన చర్యలకు ఉపక్రమించారు. సిగరెట్లు, ఇతర పొగాకు ఉత్పత్తుల చట్టం (సీవోటీపీఏ) 2003 సెక్షన్ 6(బీ) ప్రకారం విద్యాసంస్థలకు 100 గజాల లోపు పొగాకు విక్రయాలు పూర్తిగా నిషిద్ధం. అలాగే, మైనర్లకు పొగాకు ఉత్పత్తులను విక్రయించడం జువైనల్ జస్టిస్ యాక్ట్ సెక్షన్ 77 ప్రకారం శిక్షార్హమైన నేరం. ఈ చట్టాల అమలును పక్కాగా పర్యవేక్షిస్తూ, నిబంధనలు ఉల్లంఘించిన దుకాణాలపై పోలీసులు ఏకకాలంలో దాడులు నిర్వహించి కేసులు నమోదు చేశారు. హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్ నేతృత్వంలో శనివారం సుమారు 5 వేలమంది సిబ్బంది విద్యాసంస్థల సమీపంలో పొగాకు ఉత్పత్తులను విక్రయిస్తున్న 558 దుకాణాల్లో ఏకకాలంలో సోదాలు చేపట్టారు. ఈ డ్రైవ్ లో టాస్క్‌ఫోర్స్, స్పెషల్ టీమ్స్, హెచ్‌న్యూ, రిజర్వ్, లా అండ్ ఆర్డర్ పోలీసులు పాల్గొన్నారు. సీపీ సజ్జనర్ స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యటించి ఆపరేషన్‌ను పర్యవేక్షించారు. చిరాగ్ అలీ లేన్, రెడ్ హిల్స్, మెహదీపట్నం, మల్లెపల్లి ప్రియా టాకీస్ జంక్షన్, గోశామహల్ వంటి రద్దీ ప్రాంతాల్లోని విద్యాసంస్థల సమీపంలో ఉన్న దుకాణాలను ఆయన స్వయంగా తనిఖీ చేశారు. నిబంధనలు అతిక్రమించి విద్యాసంస్థల సమీపంలో సిగరెట్లు, ఇతర పొగాకు ఉత్పత్తులు విక్రయిస్తున్న నిర్వాహకులపై చట్టప్రకారం కేసులు నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. గోషామహల్‌లోని ఎంజే బ్రిడ్జి వద్ద సజ్జనార్ మీడియాతో మాట్లాడుతూ, మైనర్లకు పొగాకు ఉత్పత్తులు విక్రయిస్తూ వారి భవిష్యత్తుతో ఆడుకునే వారిపై ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు. విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అందిన ఫిర్యాదుల నేపథ్యంలో క్షేత్రస్థాయిలో చేపట్టిన డెకాయ్ ఆపరేషన్‌లో పలు దుకాణదారులు నిబంధనలను బేఖాతరు చేస్తూ చిన్నపిల్లలకు పొగాకు ఉత్పత్తులను అమ్ముతున్నట్లు ఆధారాలతో సహా తేలిందని వివరించారు. ముఖ్యంగా పాఠశాలలు, కళాశాలల సమీపంలో ఇలాంటి విక్రయాలకు పాల్పడే వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఈ తరహా నేరాలు పునరావృతం కాకుండా క్షేత్రస్థాయిలో నిరంతర నిఘా ఉంచేందుకు వీలుగా 'హెచ్‌న్యూ' విభాగంలో ఒక ప్రత్యేక అధికారిని నియమిస్తున్నట్లు ప్రకటించారు. ఈ ముప్పును అరికట్టడం కేవలం పోలీసుల బాధ్యతే కాదని, విద్యాసంస్థల యాజమాన్యాలు, తల్లిదండ్రులు సైతం సామాజిక బాధ్యతగా స్పందించాలని కోరారు. విద్యాసంస్థల పరిసరాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా ఎప్పటికప్పుడు పరిస్థితులను పర్యవేక్షించాలని సూచించారు. పిల్లల ప్రవర్తన, వారి స్నేహితులు, పాఠశాల ముగిసిన తర్వాత వారి కదలికలపై తల్లిదండ్రులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని హితవు పలికారు. విద్యాసంస్థల సమీపంలో ఎవరైనా చట్టవిరుద్ధంగా పొగాకు ఉత్పత్తులను విక్రయిస్తున్నట్లు గమనిస్తే వెంటనే డయల్ 100 లేదా హెచ్‌న్యూ ఫోన్ నంబర్ 87126 61601కు సమాచారం అందించాలని సూచించారు.

## రేవంత్ సభను విజయవంతం చేయాలి

ముఖ్య అతిథిగా విచ్చేస్తారని, ఆయనతో పాటు మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు తదితరులు పాల్గొంటారని వెల్లడించారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా తమ ప్రభుత్వం పనిచేస్తోందని, దానికి రైతు భరోసా పథకమే నిదర్శనమని మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ఉమ్మడి కరీంనగర్, వరంగల్ జిల్లాల నుంచి పెద్ద ఎత్తున రైతులు తరలివచ్చేలా చూడాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. నియోజకవర్గాల వారీగా బాధ్యతలను కేటాయించిన ఆయన, ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను, పార్టీ శ్రేణులను కోరారు. కాటారం సభ ద్వారా రైతులకు భరోసా కల్పించడమే కాకుండా, వ్యవసాయ రంగానికి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతను చాటి చెప్పబోతున్నామని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

## దక్షిణాదికి విపక్షాల చారిత్రక ద్రోహం

వంటి రాష్ట్రాలు రాజకీయ ప్రాధాన్యత కోల్పోయే ప్రమాదం ఉందని, దానిని అడ్డుకునేందుకే ప్రధాని మోదీ ఈ 'రక్షణ కవచం' లాంటి బిల్లును తెచ్చారని బండి సంజయ్ వివరించారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా దక్షిణాది సీట్లను 50 శాతం పెంచేందుకు సిద్ధమని స్పష్టమైన హామీ ఇచ్చినా విపక్షాలు స్పందించకపోవడం దారుణమన్నారు. కేవలం రాజకీయ స్వార్థం కోసమే ఈ చారిత్రక సంస్కరణను అడ్డుకుని, దక్షిణాది ప్రజలకు కాంగ్రెస్ తీరని అన్యాయం చేసిందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో జరగబోయే సీట్ల కోతకు విపక్షాలే బాధ్యత వహించాలని, ఈ ద్రోహాన్ని ప్రజలు క్షమించరని ఆయన హెచ్చరించారు.

## నారీశక్తిని అడ్డుకున్నారు

విపక్ష నేతలకు విజ్ఞప్తి చేశాం. అన్ని రాష్ట్రాలకు సమాన బలం దక్కేలా బిల్లు తీసుకొచ్చాం. మహిళా బిల్లును అడ్డుకొని విపక్షాలు భ్రూణహత్యకు పాల్పడ్డాయి. ఈ భ్రూణహత్యలో ప్రధాన పాపం కాంగ్రెస్, టీఎంసీ, డీఎంకే, ఎస్పీ పార్టీలదే. మహిళలకు రిజర్వేషన్ ఇవ్వడం విపక్షాలకు ఇష్టం లేదు. కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు ప్రాయశ్చిత్తం చేసుకోవాలి. కాంగ్రెస్ పార్టీ.. మహిళా రిజర్వేషన్ బిల్లును గతంలో చాలాసార్లు అడ్డుకుంది. మహిళా బిల్లును అడ్డుకొని విపక్ష పార్టీలు నిజస్వరూపం చూపించాయి. కాంగ్రెస్ పార్టీ పరాన్న జీవిలా బతికేస్తోంది. స్థానిక పార్టీలపై ఆధారపడి ఆ పార్టీ జీవిస్తోంది. మహిళా బిల్లుపై అవే కుట్రలు, కుతంత్రాలు చేశారు. కాంగ్రెస్, తృణమూల్, సమాజ్‌వాదీ, డీఎంకేకు ప్రజలు బుద్ధి చెబుతారు. నారీశక్తి వందన్ అధినియం బిల్లు వ్యతిరేకులు తగిన మూల్యం చెల్లించుకుంటారు.

**అదే కాంగ్రెస్ నైజం**

డీలిమిటేషన్‌పై కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు అసత్యాలు ప్రచారం చేశాయి. స్వార్థ రాజకీయాలతో ఆయా రాష్ట్రాల ప్రజలనూ మోసం చేస్తున్నాయి. డీలిమిటేషన్ వల్ల ఏ రాష్ట్రానికీ నష్టం జరగదని స్పష్టంగా చెప్పాను. అన్ని రాష్ట్రాలకు లోక్‌సభలో ప్రాతినిధ్యం పెరుగుతుందని హామీ ఇచ్చాను. బిల్లు ఆమోదం పొందితే అన్ని రాష్ట్రాల్లో సీట్లు పెరిగేవి. సీట్లు పెరిగితే కాంగ్రెస్, టీఎంసీ, ఎస్పీ వంటి అన్ని పార్టీలకు ప్రయోజనమే. రామ్ మనోహర్ లోహియా స్వప్నాలను సమాజ్‌వాదీ పార్టీ తుంగలో తొక్కింది. కాంగ్రెస్ పార్టీ సంస్కరణలకు ఎప్పుడూ వ్యతిరేకమే. జన్‌ధన్, డిజిటల్ పేమెంట్స్, జీఎస్టీని, ఆర్టికల్ 370 రద్దు, ట్రిపుల్ తలాక్ రద్దును కూడా కాంగ్రెస్ వ్యతిరేకించింది. ఉగ్రవాదం, నక్సలిజం విషయాల్లోనూ కాంగ్రెస్ వైఖరి మర్చిపోలేం. సంస్కరణ పేరు వింటే చాలు.. కాంగ్రెస్ వెంటనే వ్యతిరేకిస్తుంది. ఆ పార్టీవన్నీ నెగటివ్ రాజకీయాలు. ఏ సంస్కరణ వచ్చినా కాంగ్రెస్ అడ్డుకుంటుంది.. దుష్ప్రచారం చేస్తుంది. ప్రజలను తప్పుదోవ పట్టించడం కాంగ్రెస్‌కు వెన్నతో పెట్టిన విద్య. దేశానికి మేలు చేసే ప్రతి నిర్ణయాన్నీ అడ్డుకోవడం కాంగ్రెస్ నైజం. సైనికుల వన్ ర్యాంక్, వన్ పెన్షన్‌ను 40 ఏళ్లపాటు కాంగ్రెస్ అడ్డుకుంది. దేశంలోని మహిళలు, యువతులు కలిసి కాంగ్రెస్‌కు గట్టిగా జవాబిస్తారు" అని మోదీ అన్నారు.

## 21 నౌకలను వెనక్కి పంపించాం

తలెత్తాయి. జలసంధిని పూర్తిగా తెరుస్తున్నట్లు ఇరాన్ ప్రకటించింది. దీంతో వాణిజ్య నౌకల రాకపోకలకు అడ్డంకులు తొలగిపోయాయి. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కూడా ఈ విషయాన్ని స్వాగతించారు. అయితే, జలసంధి పూర్తిగా తెరిచినా ఇరాన్ నౌకలపై తమ దిగ్బంధనం కొనసాగుతోందని పేర్కొన్నారు. దీనిపై ఇరాన్ ఆగ్రహం వ్యక్తంచేసింది. దిగ్బంధనం కొనసాగితే.. హర్మ్యూజ్‌ను మళ్లీ మూసేస్తామని హెచ్చరించింది.

## మీ స్థాయికి దిగజారలేను

హితవు పలికారు. నాస్తికత్వం అంటే దేవుళ్లను, విశ్వాసాలను గేలిచేయడం కాదని, అదొక హేతుబద్ధమైన ఆలోచనా విధానమని స్పష్టం చేశారు. "నాస్తిక తత్వాన్ని సైతం స్వీకరించే ఏకైక మతం హిందూమతం. అలాంటి గొప్ప సంప్రదాయాన్ని తోసిపుచ్చడం హేతుబద్ధం కాదు, అది అగౌరవపరచడమే అవుతుంది. ఇవే మాటలు మీరు వేరే దేశాల్లో అని ఉంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వచ్చేది" అని నాగబాబు అన్నారు. "ఇది మీపై నా సూటి వ్యాఖ్య. భవిష్యత్తులో మీలాంటి గౌరవం మరిచి ప్రవర్తించే వారితో నేను వాదనలకు దిగను" అని తేల్చి చెప్పారు. లోక్ సభలో మహిళా రిజర్వేషన్ రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోయిన నేపథ్యంలో, ప్రధాని మోదీ మెప్పు పొందేందుకు ప్రజలకు అబద్ధాలు చెప్పడం మానుకోవాలని పవన్ కల్యాణ్ ను ఉద్దేశించి ప్రకాశ్ రాజ్ వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. ఈ వ్యాఖ్యల నేపథ్యంలోనే నాగబాబు ఈ మేరకు స్పందించారు.

## ఏఐతో ఆందోళనలు వద్దు

కృత్రిమ మేధను అనుసంధానం చేయాలంటే సమతుల్యతను పాటించాలి. అంటే ఏఐ సాంకేతికతను అందిపుచ్చుకుంటూనే, న్యాయ సంబంధిత విషయాల్లో మానవ మేధస్సు, అనుభవాన్ని ఉపయోగించాలి" అని సీజేఐ అన్నారు. "క్లిష్టమైన ప్రశ్నలతో ఉన్న ఓ కేసు మీ ముందుకు వస్తే మీరేం చేస్తారు?ఆ సమస్యను పరిష్కరించడానికి మరింత సమయం వెచ్చించి, ఆలోచిస్తారు. ఓపిగ్గా పనిచేస్తారు. అలాంటి కేసును పరిష్కరించాక గొప్ప అనుభూతి పొందుతారు. ఇలాంటి విషయాల్లో ఏఐ సామర్థ్యం సరిపోకపోవచ్చు. అందువల్ల మీరు భయపడాల్సిన పనిలేదు. న్యాయాధికారులు ఉత్పాదకతను మెరుగుపరచడానికి తగిన శిక్షణ తీసుకుంటారు. ఎక్కువ సమయం కేటాయించి, శ్రద్ధతో, సమర్థవంతంగా పని చేయగలరు" అని సీజేఐ పేర్కొన్నారు. "ఏఐ డేటా ఆధారంగా పని చేస్తుంది. మనుషులకు ఉండే విచక్షణా శక్తి దానికి ఉండదు. అలాగే నిర్ణయాలు తీసుకునేటప్పుడు మనుషుల్లా ఆలోచించలేదు. నైతిక విలువలు, సామాజిక కోణాలతో మమేకమై నిర్ణయాలు తీసుకోలేదు. రాజ్యాంగ నియమాలు, విలువలకు కట్టుబడి కేసులను పరిష్కరించాలి. ఎలాంటి ఉద్వేగాలు లేని ఏఐ వల్ల ఇది సాధ్యం కాదు" అని విశ్లేషించారు.

## బ్లాక్‌మెయిలింగ్‌కు ప్రయత్నించొద్దు

ట్రంప్ స్పష్టం చేశారు.

**ఆ ప్రతిపాదనలు పరిశీలిస్తున్నాం - ఇరాన్**

శాంతి చర్చలకు సంబంధించి అమెరికా పెట్టిన కొత్త ప్రతిపాదనలను పరిశీలిస్తున్నామని ఇరాన్ తెలిపింది. పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ అసీం మునీర్ ఆ ప్రతిపాదనలను తమకు అందజేసినట్లు ఇరాన్ సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ ఓ ప్రకటనలో పేర్కొంది. అయితే, ఎటువంటి ప్రతిపాదనలు ఉన్నాయనే విషయాన్ని మాత్రం వెల్లడించలేదు. క్షేత్రస్థాయి వాస్తవాలకు అనుగుణంగా అమెరికా తన డిమాండ్లను మార్చుకోవాల్సి ఉంటుందని సెక్యూరిటీ కౌన్సిల్ సూచించింది. యుద్ధం పూర్తిగా ముగిసేవరకు హర్మ్యూజ్ రాకపోకలపై పూర్తి నియంత్రణ కొనసాగిస్తామని స్పష్టం చేసింది.

**శత్రువులకు ఘోర పరాజయమే: మొజ్తాబా ఖమేనీ**

ఇరాన్-అమెరికా మధ్య దౌత్య చర్చల కోసం ప్రయత్నాలు జరుగుతున్న నేపథ్యంలో ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీ కీలక హెచ్చరికలు చేశారు. శత్రువులకు ఘోర పరాజయాన్ని రుచి చూపించడానికి తమ నౌకాదళం సిద్ధంగా ఉందన్నారు. మరోవైపు ఇరుపక్షాలు ఉమ్మడి నిర్ణయం తీసుకునే వరకూ అమెరికాతో ఎటువంటి చర్చలు జరగవని ఇరాన్ ఉప విదేశాంగ మంత్రి సయీద్ ఖతిబ్జా పేర్కొన్నారు. ఏదేమైనప్పటికీ ఎవరి కోసమూ హక్కులను వదులుకోబోమని స్పష్టం చేశారు. ఇరాన్ ఓడరేవులపై అమెరికా విధించే ఎలాంటి దిగ్బంధనాన్ని టెహ్రాన్ అంగీకరించబోదని.. వాషింగ్టన్ నుంచి వచ్చే ఆదేశాలకు కట్టుబడి ఉండబోదని తెలియజేశారు. ఇతర దేశాలు ఎలా ఉండాలో చెప్పే హక్కు ఆ దేశానికి లేదని వ్యాఖ్యానించారు.

**పశ్చిమాసియా జలాల్లోకి తిరిగొచ్చిన జెరాల్డ్..**

ఇరుదేశాల మధ్య మాటల యుద్ధం కొనసాగుతున్న నేపథ్యంలో అమెరికా విమాన వాహక నౌక 'యూఎస్ఎస్ జెరాల్డ్ ఆర్ ఫోర్డ్' మళ్లీ పశ్చిమాసియా జలాల్లోకి ప్రవేశించింది. ఇటీవల అగ్ని ప్రమాదానికి గురైన ఈ ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్.. మరమ్మతుల అనంతరం ఇతర విమాన వాహకనౌకలతో పాటు విధుల్లో చేరినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. నెలరోజుల పాటు తూర్పు మధ్యధరా సముద్రంలో ఉన్న ఈ నౌక సూయజ్ కాలువను దాటి.. ఎర్రసముద్రంలోకి ప్రవేశించినట్లు సంబంధిత అధికారులు పేర్కొన్నారు. దీంతోపాటు యూఎస్ఎస్ మహాన్, యూఎస్ఎస్ విన్‌స్టన్ ఎస్.చర్చిల్ అనే రెండు డిస్ట్రాయర్లు కూడా ఉన్నట్లు తెలిపారు. మరో అమెరికా విమాన వాహక నౌక యూఎస్ఎస్ జార్జ్ హెచ్.డబ్ల్యూ.బుష్ సైతం పశ్చిమాసియా వైపు వెళ్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం అది దక్షిణాఫ్రికా తీరంలో ఉంది. యూఎస్ఎస్ అబ్రహం లింకన్ ప్రస్తుతం అరేబియా సముద్రంలో మోహరించి ఉంది. అగ్రరాజ్యం మళ్లీ పశ్చిమాసియాలో నౌకా దళాన్ని మోహరిస్తుండడంతో ఏ సమయంలో ఏం జరుగుతుందోనని ప్రపంచ దేశాలు కలత చెందుతున్నాయి.

## 3, 4వ రైల్వే లైన్ల నిర్మాణం

ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. హౌరా-చెన్నై హై డెన్సిటీ నెట్‌వర్క్‌లో భాగంగా ఈ ప్రాజెక్టును చేపట్టనున్నారు. ఈ రైల్వే మార్గం తూర్పు గోదావరి, కోనసీమ, కాకినాడ, అనకాపల్లి, విశాఖపట్నం జిల్లాల గుండా వెళుతుంది. తూర్పు తీర రైల్వే కారిడార్‌లో ఇది అత్యంత రద్దీగా ఉండే మార్గాల్లో ఒకటిగా ఉంది, ముఖ్యంగా సరుకు రవాణాకు కీలకం. ఈ ప్రాజెక్టు పూర్తయితే అన్నవరం, అంతర్వేది, ద్రాక్షారామం వంటి పుణ్యక్షేత్రాలకు వెళ్లే యాత్రికులకు ప్రయాణం మరింత సులభతరం కానుంది. ఆంధ్రప్రదేశ్‌తో పాటు ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్-సీతాపూర్ మధ్య మరో ప్రాజెక్టుకు కూడా కేంద్రం ఆమోదం తెలిపింది. ఈ రెండు ప్రాజెక్టుల మొత్తం వ్యయం రూ.24,815 కోట్లు. ఈ ప్రాజెక్టుల ద్వారా మొత్తం 601 కిలోమీటర్ల మేర రైల్వే నెట్‌వర్క్ విస్తరించనుంది. ఈ కొత్త లైన్ల నిర్మాణం బొగ్గు, ఆహార ధాన్యాలు, సిమెంట్, ఎరువులు వంటి సరుకుల రవాణాను వేగవంతం చేయడంతో పాటు, పర్యాటక రంగ అభివృద్ధికి కూడా దోహదపడుతుందని కేంద్రం ఒక ప్రకటనలో పేర్కొంది.

**ఏపీ శనగ రైతులకు కేంద్రం ఊరట.. కొనుగోలు పరిమితి పెంపు**

ఆంధ్రప్రదేశ్‌లోని శనగ రైతులకు కేంద్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. రాష్ట్రంలో మద్దతు ధర పథకం కింద శనగల కొనుగోలు పరిమితిని గణనీయంగా పెంచుతూ శనివారం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు, కొనుగోలు గరిష్ఠ పరిమితిని 1,13,250 మెట్రిక్ టన్నులకు పెంచుతూ కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఆమోదం తెలిపారు. వాస్తవానికి తొలుత 94,500 మెట్రిక్ టన్నుల సేకరణకు అనుమతి ఇవ్వగా, ఇప్పుడు ఆ పరిమితిని పెంచారు. ఏపీతో పాటు ఇతర రాష్ట్రాల రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు కూడా కేంద్రం పలు చర్యలు ప్రకటించింది. ఉత్తరప్రదేశ్‌లో 20 లక్షల మెట్రిక్ టన్నుల బంగాళాదుంపల కొనుగోలుకు, కర్ణాటకలో కందుల కొనుగోలు గడువును మే 15 వరకు పొడిగించడానికి ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి చౌహాన్ మాట్లాడుతూ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో రైతుల ప్రయోజనాల పరిరక్షణకు కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. మార్కెట్ ఒడిదొడుకుల కారణంగా ఏ రైతు కూడా తమ పంటను తక్కువ ధరకు అమ్ముకోవాల్సిన పరిస్థితి రాకూడదన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఆయన వివరించారు. రాష్ట్ర ప్రభుత్వాలతో సమన్వయం చేసుకుంటూ రైతులకు అవసరమైన సహాయాన్ని తక్షణం అందిస్తామని హామీ ఇచ్చారు.

# గులాబీ గూటిలో సెగలు.. కమలం వైపు మల్లారెడ్డి చూపు?

తెలంగాణలో అధికార మార్పిడి జరిగిన తర్వాత బీఆర్ఎస్ లో ఒక విధమైన సందిగ్ధత నెలకొంది. పార్టీలోని కీలక నేతలు తమ రాజకీయ భవిష్యత్తు కోసం ప్రత్యామ్నాయాలను వెతుక్కుంటున్నారు. తెలంగాణ రాజకీయాలు ఎప్పుడూ అనూహ్య మలుపులకు వేదికవుతూనే ఉంటాయి. తాజాగా మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే మల్లారెడ్డి భారత ప్రధాని నరేంద్ర మోదీతో భేటీ కావడం అటు రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లోనూ.. ఇటు దేశ రాజధాని ఢిల్లీలోనూ పెను చర్చకు దారితీసింది. మల్లారెడ్డి వంటి సీనియర్ నేత.. అదీ రాష్ట్రంలో ప్రతిపక్షంలో ఉన్న పార్టీకి చెందిన ఎమ్మెల్యే, నేరుగా ప్రధానిని కలవడం వెనుక ఉన్న రాజకీయ గూఢార్థాలు ఇప్పుడు విశ్లేషణలకు పని పెడుతున్నాయి.

**వారసత్వ రాజకీయాల కొత్త అడుగు**

ఈ భేటీలో అందరినీ ఆకర్షించిన ప్రధానాంశం మల్లారెడ్డి తన కోడలు ప్రీతిరెడ్డిని వెంట తీసుకెళ్లడం.. సాధారణంగా రాజకీయ నాయకులు తమ వారసులను జాతీయ స్థాయి నేతలకు పరిచయం చేస్తున్నారంటే.. అది భవిష్యత్తు ప్రాతినిధ్యానికి పునాది అని అర్థం. గత కొంతకాలంగా ప్రీతిరెడ్డి ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావాలని ఆకాంక్షిస్తున్నారు. ముఖ్యంగా పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేయాలనే తన కోరికను ఆమె గతంలోనే బహిరంగ పరిచారు. ఇప్పుడు ప్రధాని మోదీతో భేటీ ద్వారా.. ఆమెను బీజేపీ తరఫున ఎంపీ అభ్యర్థిగా బరిలోకి దింపే దిశగా మల్లారెడ్డి పావులు కదుపుతున్నట్లు స్పష్టమవుతోంది.



బీఆర్ఎస్ పట్టు సడలుతోందా?

తెలంగాణలో అధికార మార్పిడి జరిగిన తర్వాత బీఆర్ఎస్ లో ఒక విధమైన సందిగ్ధత నెలకొంది. పార్టీలోని కీలక నేతలు తమ రాజకీయ భవిష్యత్తు కోసం ప్రత్యామ్నాయాలను వెతుక్కుంటున్నారు. మల్లారెడ్డికి మేడ్చల్, మల్కాజిగిరి పరిసర ప్రాంతాల్లో బలమైన ఆర్థిక, సామాజిక పట్టు ఉంది. ఆయన వంటి నేత పార్టీని వీడితే అది గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో బీఆర్ఎస్‌కు కోలుకోలేని దెబ్బ అవుతుంది. అయితే బీఆర్ఎస్ శ్రేణులు దీనిని "మర్యాదపూర్వక భేటీ"గా అభివర్ణిస్తున్నప్పటికీ రాజకీయాల్లో 'అకస్మాత్తు మర్యాదలు' ఉండవనేది జగమెరిగిన సత్యం.

**బీజేపీ ఆపరేషన్ ఆకర్ష్**

మరోవైపు తెలంగాణలో పాగా వేయాలని చూస్తున్న భారతీయ జనతా పార్టీకి మల్లారెడ్డి వంటి 'మాస్' ఇమేజ్ ఉన్న నేతలు అవసరం. ఆర్థిక వనరులు, విద్యాసంస్థల నెట్‌వర్క్ ఉన్న మల్లారెడ్డి కుటుంబం బీజేపీలోకి వస్తే, అది పార్టీకి అదనపు బలాన్ని ఇస్తుంది. బండి సంజయ్‌తో ప్రీతిరెడ్డి గతంలో జరిపిన భేటీని, ఇప్పటి మోదీ భేటీని కలిపి చూస్తే.. మల్లారెడ్డి కుటుంబం కమల తీర్థం పుచ్చుకోవడానికి ముహూర్తం ఖరారైనట్లే కనిపిస్తోంది. రాజకీయాల్లో శాశ్వత శత్రువులు, శాశ్వత మిత్రులు ఉండరు.. కేవలం ప్రయోజనాలు మాత్రమే ఉంటాయన్న నానుడి మల్లారెడ్డి విషయంలో మరోసారి రుజువయ్యేలా ఉంది. ఒకవేళ మల్లారెడ్డి బీజేపీ గూటికి చేరితే, అది తెలంగాణలో కొత్త రాజకీయ సమీకరణాలకు దారితీస్తుంది. తన రాజకీయ వారసురాలిగా కోడలు ప్రీతిరెడ్డిని ఢిల్లీ పీఠం వైపు నడిపించేందుకు మల్లారెడ్డి వేసిన ఈ 'మాస్టర్ ప్లాన్' ఎంతవరకు పారుతుందో కాలమే నిర్ణయించాలి. ఏది ఏమైనా ఈ భేటీ బీఆర్ఎస్ శిబిరంలో ఆందోళనను, బీజేపీ వర్గాల్లో ఉత్సాహాన్ని నింపిందనడంలో సందేహం లేదు. రాబోయే రోజుల్లో వెలువడే అధికారిక ప్రకటనలు తెలంగాణ రాజకీయాల్లో మరిన్ని ప్రకంపనలు సృష్టించవచ్చు.

మరిన్ని వార్తా విశేషాలకై... www.viswamvoice.com

# ఎడిటర్ వాయిస్

## తెలంగాణాలో మళ్లీ ఎన్నికల సందడి.. రేవంత్ సర్కార్ దూకుడు!

వరుస విజయాలతో దూకుడు మీద ఉన్న తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం మరో ఎన్నికల సంగ్రామానికి సిద్ధమవుతోందని సంకేతాలు వెలువడుతున్నాయి. బీసీ రిజర్వేషన్లపై వివాదం కారణంగా గత సెప్టెంబరులో వాయిదా పడిన జడ్పీ, మండల పరిషత్ ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం సిద్ధమవుతోందని ప్రచారం జరుగుతోంది. కోర్టు అనుమతితో పంచాయతీ, మున్సిపల్ ఎన్నికలు నిర్వహించినట్లు వచ్చే నెలలో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నిర్వహణకు రంగం సిద్ధం చేయాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించినట్లు చెబుతున్నారు.

ఓటర్ల జాబితాతోసహా ఎన్నికల నిర్వహణకు అన్ని సిద్ధంగా ఉండటంతో కోర్టు అనుమతి వచ్చిన వెంటనే ఎన్నికలు నిర్వహించాలని కాంగ్రెస్ సర్కార్ భావిస్తున్నట్లు చెబుతున్నారు. నిజానికి గత సెప్టెంబరులోనే ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. రెండు విడతలుగా ఎన్నికలు నిర్వహించేందుకు షెడ్యూల్ కూడా విడుదల చేసింది. అయితే అప్పట్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించడంతో కోర్టు బ్రేక్ వేసింది. రాజ్యాంగ సవరణ చేస్తే కానీ బీసీ రిజర్వేషన్లను పెంచే అవకాశం లేకపోవడంతో ప్రభుత్వం వెనక్కి తగ్గి యథావిధిగా పాత పద్ధతిలోనే ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించిందని అంటున్నారు.

ప్రభుత్వ తాజా నిర్ణయంతో వచ్చే నెలలో ఎన్నికల నిర్వహణకు యంత్రాంగం తగిన చర్యలు తీసుకుంటోందని చెబుతున్నారు. ముందుగా నవీకరించిన ఓటర్ల జాబితాల తయారీతోపాటు కొత్త ఓటర్ల నమోదుకు చర్యలు తీసుకుంటున్నారు. ఈ నెల 23లోగా కొత్త ఓటర్ల గుర్తింపు, జాబితా తయారీ, పోలింగ్ కేంద్రాల ఎంపిక వంటి పనులు అన్నీ పూర్తి చేయాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం రెడీ అవుతున్నట్లేనని అంటున్నారు. దీంతో చాలాకాలంగా పదవుల కోసం ఎదురుచూస్తున్న ద్వితీయ, తృతీయశ్రేణి నేతలు ఎన్నికల యుద్ధానికి సిద్ధమవుతున్నారు.

2019 మే నెలలో చివరి సారిగా జడ్పీ, మండల పరిషత్ ఎన్నికలు జరిగాయి. గత ఏడాది జూన్ తో పాలవవర్గాల గడువు తీరిపోయింది. రిజర్వేషన్లు పెంచి ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం భావించింది. దీంతో గత ఏడాది నుంచి జడ్పీ, మండల పరిషత్ లకు ప్రత్యేకాధికారులను నియమించింది. ఇలా నిలిపోయిన ఎన్నికల ప్రక్రియకు మళ్లీ చలనం తీసుకువచ్చేలా ప్రభుత్వం అడుగులు వేస్తుండటంతో గ్రామస్థాయి నేతల్లో హడావుడి మొదలైంది.



ఎడిటర్ : కె.సునీల్‌కుమార్

## మహిళల హక్కులను విపక్షాలు కాలరాశాయి : లక్ష్మణ్



హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ : రాజ్యాంగ సవరణ బిల్లును వ్యతిరేకించి, మహిళల హక్కులను విపక్షాలు కాల రాశాయని భాజపా రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్ విమర్శించారు. కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా మహిళలు కదం తొక్కుతున్నారని అన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ దక్షిణాది ప్రజలు కాంగ్రెస్, ప్రాంతీయ పార్టీలకు బుద్ధి చెబుతారని అన్నారు. " మోదీకి ఆదరణ పెరుగుతుంది, భాజపా బలపడుతుందనే బిల్లును అడ్డుకున్నారు. మహిళలను చట్టసభలకు రాకుండా అడ్డుకున్నారు. దక్షిణాదికి అన్యాయం జరగదని చెప్పినా సాంకేతిక కారణాలతో మహిళా బిల్లును అడ్డుకున్నారు. దేశవ్యాప్తంగా మహిళలను ఏకం చేసి కాంగ్రెస్, విపక్షాలకు వ్యతిరేకంగా ఉద్యమిస్తాం. డీలిమిటేషన్, 131వ రాజ్యాంగ సవరణ బిల్లుల విషయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రతిపాదనను ఒక్క ఎంపీ కూడా పార్లమెంట్‌లో ప్రస్తావించలేదు" అని లక్ష్మణ్ అన్నారు.

## కాంగ్రెస్ పార్టీ చారిత్రక తప్పిదం చేసింది : కిషన్‌రెడ్డి



దిల్లీ, విశ్వం వాయిస్ న్యూస్ : మహిళలకు కాంగ్రెస్ పార్టీ మరోసారి అన్యాయం చేసిందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. నియోజకవర్గాల పునర్విభజన జరగాలని గతంలో చేసిన చట్టంలోనే ఉందని, దక్షిణాది రాష్ట్రాలకు న్యాయం జరిగేలా మంచి ఫార్ములాను మోదీ తీసుకొచ్చారని అన్నారు. కానీ, 131వ రాజ్యాంగ సవరణ బిల్లును అడ్డుకొని కాంగ్రెస్ పార్టీ చారిత్రక తప్పిదం చేసిందన్నారు. వరుసగా ఎన్నికల్లో ఓడిపోతున్నామనే నిరాశ, నిస్పృహ కాంగ్రెస్‌లో కనిపిస్తోందని వ్యాఖ్యానించారు. దిల్లీలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మహిళలు, దక్షిణాది రాష్ట్రాలకు మేలు జరిగే బిల్లును అడ్డుకొని విపక్షాలు తప్పు చేశాయన్నారు. "రాజకీయాల్లోకి రావాలనుకునే మహిళల ఉత్సాహంపై నీళ్లు చల్లారు. సర్జికల్ స్ట్రైక్స్, ఆపరేషన్ సిందూర్‌ను కూడా అవమానించేలా రాహుల్ గాంధీ మాట్లాడారు. ప్రధాని మోదీని జాదుగర్ అంటూ అవమానించారు" అని కిషన్‌రెడ్డి మండిపడ్డారు.

తేజస్వి సూర్య మాటలు

## పార్లమెంట్ రికార్డులో ఉండకూడదు

మంత్రి పొన్నం ప్రభాకర్



హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ : డీలిమిటేషన్‌లో దక్షిణాదికి ఎన్డీఏ అన్యాయం చేసే ప్రయత్నం చేసిందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఉద్యమం చేసి సాధించుకున్న తెలంగాణను భాజపా ఎంపీ తేజస్వి సూర్య అవమానించారని అన్నారు. తెలంగాణను అవమానిస్తుంటే భాజపా ఎంపీలు నోరు మెదపలేదని ఆక్షేపించారు. తేజస్వి సూర్య మాటలు పార్లమెంట్ రికార్డులో ఉండకూడదని అన్నారు. "మహిళా బిల్లును డీలిమిటేషన్‌తో ముడిపెట్టకుంటే కాంగ్రెస్ మద్దతిస్తుంది. కేంద్రం కుట్రపూరితంగా మహిళా బిల్లును పార్లమెంట్‌లో పెట్టింది" అని పొన్నం ఆరోపించారు.

## తెలుగు రాష్ట్రాల ఎంపీలకు కేంద్రమంత్రి విందు..

పాల్గొన్న సీఎం రేవంత్



విశ్వం వాయిస్ న్యూస్ : కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ దిల్లీలో తెలుగు రాష్ట్రాల ఎంపీలకు శనివారం ఉదయం అల్పాహార విందు ఇచ్చారు. భాజపా, తెదేపా, కాంగ్రెస్ ఎంపీలతో పాటు తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ఈ విందుకు హాజరయ్యారు. ఏపీ ఉపసభాపతి రఘురామకృష్ణరాజు, ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, కేంద్ర మంత్రులు పెమ్మసాని చంద్రశేఖర్, రామ్మోహన్ నాయుడు, కిషన్‌రెడ్డి, కుమారస్వామి ఈ విందులో పాల్గొన్నారు. ఇది సాధారణంగా ఇచ్చిందేనని, రాజకీయ కోణం ఏమీ లేదని శ్రీనివాస్ వర్మ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రులు కుమారస్వామి, శ్రీనివాసవర్మను కలిసిన సీఎం రేవంత్.. బయ్యారంలో గ్రీన్ స్టీల్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్‌ను కాలుష్యం లేని నగరంగా మార్చేందుకు సహకరించాలని కోరారు.

వరంగల్ ఎయిర్‌పోర్టుకు

## త్వరలో శంకుస్థాపన

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ : వరంగల్, ఆదిలాబాద్, కొత్తగూడెంలో ఎయిర్‌పోర్టుల నిర్మాణంపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమీక్ష నిర్వహించారు. వరంగల్ ఎయిర్‌పోర్టుకు త్వరలో శంకుస్థాపన చేస్తామన్నారు. ఆదిలాబాద్ విమానాశ్రయానికి మాస్టర్‌ప్లాన్ సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. కొత్తగూడెంలో ప్రతిపాదిత భూమి అనువుగా లేదని విమానయాన శాఖ తెలిపింది. అధ్యయనం చేసి సాధ్యాసాధ్యాలపై నివేదిక ఇవ్వాలని మంత్రి ఆదేశించారు.

20న రెండో విడత

## రైతు భరోసా నిధుల విడుదల

హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ : తెలంగాణలో ఈ నెల 20వ తేదీన రెండో విడత రైతుభరోసా నిధులు విడుదల చేయనున్నారు. భూపాలపల్లి జిల్లా కాటారం బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి వీటిని విడుదల చేయనున్నారు. రెండో విడతలో 45,11,947 మంది రైతులకు రూ.5,653 కోట్ల నిధులు జమ కానున్నాయి. మార్చి 22న సిద్దిపేట జిల్లా నర్మెటలో జరిగిన బహిరంగ సభలో తొలి విడతగా 1.50 కోట్ల ఎకరాలకు రూ.3,590 కోట్లు జమ చేసిన సంగతి తెలిసిందే.

## జగిత్యాలలో పండుగ వాతావరణం కనిపిస్తోంది

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



జగిత్యాల, విశ్వం వాయిస్ న్యూస్ : జగిత్యాలలో ఒక పండుగ వాతావరణం కనిపిస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. జీవన్‌రెడ్డిని కలిసిన అనంతరం మాజీ మంత్రి హరీశ్‌రావుతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. మాజీ సీఎం కేసీఆర్‌కు తెలిసిందే ప్రజలను కలవడమని అన్నారు. కేసీఆర్ ఇక్కడికి వస్తున్నారంటే.. సీఎం మేడిగడ్డ పోతున్నారని వ్యాఖ్యానించారు. "కోరుట్ల నుంచి రాకుండా ఇప్పుడు రోడ్డు తవ్వుతున్నారు. ఇన్ని రోజులు రోడ్డు గుర్తుకురాలేదు. గతంలో ఎన్నో బహిరంగసభలు ఇక్కడ జరిగాయి. ఇప్పుడు కూడా సభ విజయవంతమవుతుంది" అని కేటీఆర్ అన్నారు. జగిత్యాలలోని వివేకానంద మినీ స్టేడియంలో ఈనెల 20న కేసీఆర్ బహిరంగ సభ ఏర్పాటు చేయనున్నారు. కేసీఆర్ సమక్షంలో సీనియర్ నేత జీవన్‌రెడ్డి బీఆర్ఎస్‌లో చేరనున్నారు. ఈ క్రమంలో సభా ఏర్పాట్లను హరీశ్‌రావు, కేటీఆర్ పరిశీలించారు.

# వనిత వాయిస్


## ప్రాతినిధ్యమేనా... అధికారం వద్దా?

రాజకీయాల్లో మహిళలకు తగిన ప్రాతినిధ్యం గురించి దేశవ్యాప్తంగా చర్చ నడుస్తోంది. కానీ ఒక దేశ మహిళల రాజకీయ ప్రగతి సీట్ల దగ్గరే ఆగిపోకూడదు, నిర్ణయ శక్తిగానూ మారాలి. ప్రభుత్వం, అధికార యంత్రాంగం... ఇలా కీలక విభాగాల్లో మహిళల ప్రాతినిధ్యం 50 శాతం ఉన్నప్పుడే ఐరాస సూచించిన సుస్థిర అభివృద్ధి లక్ష్యాల్ని చేరుకునేది. సాధికారత సాధ్యమయ్యేది. ప్రస్తుతం భారత పార్లమెంటులో 98 మంది మహిళా ఎంపీలు ఉన్నారు. కేంద్ర మంత్రి వర్గంలో ఉన్నది మాత్రం ఏడుగురే. వాళ్లలో ఇద్దరు- నిర్మలా సీతారామన్(ఆర్థిక శాఖ) అన్నపూర్ణా దేవి(స్త్రీ, శిశు సంక్షేమం) మాత్రమే కేబినెట్ హోదాలో ఉన్నారు. దీన్ని బట్టి మహిళలకు సీట్లు మాత్రమే కాదు, నిజమైన అధికారమూ దక్కడంలేదని అర్థం చేసుకోవచ్చు. కేంద్ర కేబినెట్‌లో మహిళా ప్రాతినిధ్యం పరంగా 181 దేశాల జాబితాలో భారత్‌కు 174వ స్థానం దక్కింది. పది శాతం లోపు ప్రాతినిధ్యం ఉన్న దేశాల్లో భారత్ చోటు దక్కించుకుంది. ప్రభుత్వంలోనే కాదు, అధికార యంత్రాంగంలోనూ మహిళల ప్రాతినిధ్యం తక్కువ. భారత్‌లో అధికార యంత్రాంగానికి నాయకత్వం వహించే కేబినెట్ సెక్రటరీ స్థానంలో ఇప్పటివరకూ ఒక్క మహిళ కూడా లేరు. భారత్‌లోనే కాదు, ప్రపంచవ్యాప్తంగా నిర్ణయాత్మక స్థానాల్లో మహిళలకు ప్రాతినిధ్యం తక్కువగా దక్కుతోంది. జనవరి 2026 లెక్కల ప్రకారం కేవలం 28 దేశాల్లో మహిళలు ప్రభుత్వ, దేశాధినేతలుగా ఉన్నారు. ఇదే రీతిలో ముందుకు వెళ్తే మరో 130 ఏళ్లకు గానీ ప్రభుత్వ అధినేతలుగా సగం మంది మహిళలు ఉండరు. ప్రపంచవ్యాప్తంగా కేబినెట్ మంత్రులుగా 22.4 శాతమే మహిళలు ఉన్నారు. 14 దేశాల్లో మహిళలు 50 శాతం అంతకంటే ఎక్కువ మంది కేబినెట్ మంత్రులుగా పనిచేస్తున్నారు. మహిళా మంత్రులకు స్త్రీ శిశు సంక్షేమం, కుటుంబ సంరక్షణ, సామాజిక అభివృద్ధి... లాంటి శాఖలనే అప్పగిస్తున్నారు. దీనికి భిన్నంగా హోమ్, రక్షణ, ఆర్థిక, విదేశాంగ, విద్య, ఆరోగ్యం... వంటి శాఖల్లో 85 శాతం పురుషులే ఉన్నారు. మహిళలు రాజకీయంగా అధికారంలో ఉన్నచోట



నిర్ణయాలు తీసుకునే విధానం మెరుగ్గా ఉంటుందని అధ్యయనాలు చెబుతున్నాయి. మహిళలు సర్పంచ్‌లుగా ఉన్నచోట తాగునీటి ప్రాజెక్టులు 62 శాతం ఎక్కువగా ఉన్నాయి. నార్వేలో మున్సిపల్ కౌన్సిళ్లలో మహిళలు ఎక్కువగా ఉన్నప్పుడు అక్కడ శిశు సంక్షేమం మెరుగైంది. పార్లమెంటులో మహిళా నాయకత్వం ఉన్నచోట పార్టీలకు అతీతంగా మహిళా సంక్షేమం కోసం పనిచేస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో మహిళలపైన హింస, శిశు సంక్షేమం, పెన్షన్లు, లింగ సమానత్వ చట్టాలు, ఎన్నికల సంస్కరణలు... ఇలా ఎన్నింటిలోనో బిల్లులు ఆమోదం పొందుతున్నాయి.

## మహిళలదే బాధ్యతంతా..



వీళ్లది రాయ్‌పుర్‌లోని పచేరా గ్రామం. వెనకబాటు నుంచి బయటపడి సాధికారత సాధించాలని తలిచారు ఈ ఎనిమిది మంది మహిళలు. వాళ్ల ఆలోచనల్ని ఒకరితో ఒకరు పంచుకున్నారు. బృందంగా వెళ్లి అధికారుల్ని ఆశ్రయించారు. అవకాశాల గురించి వాకబు చేశారు. ఇల్లు, పిల్లలు తప్ప వేరే ప్రపంచం లేదు అక్కడి మహిళలకి. యజమాని సంపాదనతోనే ఇల్లు నడిచేది. ఈ పద్ధతిని మార్చాలనుకున్నారు. అవకాశాల్ని అందిపుచ్చుకున్నారు. వాటర్ ప్లాంట్‌ను నడిపే బాధ్యతను చేపట్టారు. వీళ్లది రాయ్‌పుర్‌లోని పచేరా గ్రామం. వెనకబాటు నుంచి బయటపడి సాధికారత సాధించాలని తలిచారు ఈ ఎనిమిది మంది మహిళలు. వాళ్ల ఆలోచనల్ని ఒకరితో ఒకరు పంచుకున్నారు. బృందంగా వెళ్లి అధికారుల్ని ఆశ్రయించారు. అవకాశాల గురించి వాకబు చేశారు. బిహాన్ యోజన పథకం గురించి తెలుసుకున్నారు. గ్రామీణ మహిళలకు ఉపాధి అవకాశాల్ని చూపిస్తూ... సొంత వ్యాపారాలు పెట్టుకోవడానికి సహాయం అందిస్తుందీ పథకం. అంతేకాదు, పాత పద్ధతుల ద్వారా ఆదాయం సమకూర్చుకునే మార్గాల్ని ఎంచుకోవడం కన్నా... కొత్త ప్రాజెక్టుల్ని చేపట్టాలనే ఉద్దేశాన్నీ ప్రచారం చేస్తుందీ పథకం. అందుకే అధికారుల సలహాతో ఆల్కలైన్ నీళ్లను తయారుచేసి, అమ్మాలనుకున్నారు ఇక్కడి మహిళలు. నాణ్యమైన నీటిని అందిస్తే పిల్లలకీ, పెద్దలకీ కలిగే లాభాల్ని తెలుసుకున్నారు. ఈ ప్రాజెక్టునే చేపట్టాలని నిర్ణయించుకున్నారు.

**50వేల బాటిళ్లు...**

ప్లాంట్‌ల స్థాపన దగ్గర్నుంచీ ప్రతి విషయాన్ని దగ్గరుండి చూసుకున్నారు. శుద్ధి చేసే సాంకేతికతనూ అందిపుచ్చుకున్నారు. 'ముందుగా డ్యామ్ నుంచి నీటిని ప్లాంట్‌కు తీసుకువస్తాం. ప్లాంట్‌లో పదివేల లీటర్ల నీటిని నిల్వ చేసే సామర్థ్యం ఉన్న ట్యాంకర్లు ఉన్నాయి. అక్కడి నుంచి 7 దశల్లో నీటిని వడపోస్తాం. తర్వాత దానికి పీహెచ్ బూస్టర్లను కలుపుతాం' అంటారు సంఘ సభ్యురాలు పూర్ణిమ. ఇలా తయారుచేసిన నీళ్లను 500ఎం.ఎల్. బాటిళ్లలో నింపుతారు. వాటికి సంఘం పేరుతోనే బ్రాండింగ్ చేస్తున్నారు. స్థానిక కార్యాలయాలు, మార్కెట్లు, ఎగ్జిబిషన్లలో అమ్ముతున్నారు. మంచి ఆదాయాన్ని పొందుతున్నారు. తొందర్లోనే ప్లాంట్ కార్యకలాపాల్ని మరింత విస్తరించి, ఆసక్తి ఉన్న మహిళలకి శిక్షణ ఇచ్చి వాళ్లకీ ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో అడుగులు వేస్తున్నాం అంటోన్న ఈ మహిళల ప్రయాణం స్ఫూర్తిదాయకమే కదూ!

# విజయ్ దేవరకొండ కొత్త సినిమా షూరు..

### అంచనాలు పెంచేసిన ఫస్ట్ లుక్ పోస్టర్.. డైరెక్టర్ ఎవరంటే..



టాలీవుడ్ హీరో విజయ్ దేవరకొండ ప్రస్తుతం వరుస చిత్రాలతో ఫుల్ బిజీగా ఉన్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఆయన రౌడీ జనార్ధన, రణబాలీ చిత్రాల్లో నటిస్తున్నారు. తాజాగా ఆయన మరో చిత్రానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. సక్సెస్ ఫుల్ డైరెక్టర్ తెరకెక్కిస్తున్న ఓ చిత్రంలో నటించనున్నారు. ఈ విషయాన్ని తెలియజేస్తూ చిత్ర బృందం పోస్టర్‌ను విడుదల చేసింది. ఇండియన్ సినిమాను గ్లోబల్ స్థాయికి తీసుకెళ్లేందుకు తనదైన ముందడుగు వేశారు హీరో విజయ్ దేవరకొండ. హాయ్ నాన్న ఫేమ్ డైరెక్టర్ శౌర్యువ్ తో విజయ్ దేవరకొండ చేస్తున్న హ్యూజ్ గ్లోబల్ ప్రాజెక్ట్ ఈ రోజు అఫీషియల్ గా అనౌన్స్ చేశారు. ఇంటర్నేషల్ టెక్నీషియన్స్ ఈ మూవీకి వర్క్ చేస్తుండటం విశేషం. వైరా బ్యానర్ నిర్మిస్తున్న ఈ ప్రెస్టీజియస్ మూవీ అనౌన్స్ మెంట్ పోస్టర్ రిలీజ్ చేశారు. ఈ పోస్టర్ సినిమా మీద హై ఎక్స్ పెక్టేషన్స్ క్రియేట్ చేస్తోంది. విజయ్ దేవరకొండ, డైరెక్టర్ శౌర్యువ్ సినిమాకు హౌస్ ఆఫ్ ది డ్రాగన్, ఫాల్ ఔట్ వంటి హాలీవుడ్ చిత్రాలకు పనిచేసిన అలెజాండ్రో మార్టినెజ్ డైరెక్టర్ ఆఫ్ ఫొటోగ్రఫీగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. గాడ్స్ ఆఫ్ ఈజిప్ట్, బ్యాట్ మ్యాన్ ఫరెవర్, స్నోపియర్సర్ చిత్రాల వీఎఫ్ఎక్స్ సూపర్ వైజర్ ఎరిక్ డస్ట్ ఈ మూవీకి పనిచేస్తున్నారు. యానిమల్, ఓం శాంతి ఓం వంటి చిత్రాలకు పనిచేసిన సురేష్ సెల్వరాజన్ ఈ సినిమా ప్రొడక్షన్ డిజైనర్ గా వ్యవహరిస్తున్నారు. పలు సూపర్ హిట్ చిత్రాల కంపోజర్ హేషమ్ అబ్దుల్ వాహాబ్ మ్యూజిక్ అందిస్తున్నారు. ఇండియన్ సినిమాకు గ్లోబల్ స్థాయి క్రేజ్ తీసుకురావడంలో వారణాసి, రాకా చిత్రాల్లా విజయ్ శౌర్యువ్ మూవీ కూడా ప్రయత్నిస్తోంది. ఈ రోజు రిలీజ్ చేసిన వీడీ శౌర్యువ్ మూవీ పోస్టర్‌లో విజయ్ దేవరకొండ చేతిలో నాలుగు పెట్ డాగ్స్‌ను తీసుకుని నడుచుకుంటూ వస్తుండటం, వెనక ఏడుగురు వ్యక్తులు వివిధ రకాల ఆయుధాలు చేపట్టి రావడం ఆసక్తి కలిగిస్తోంది. 'ఇప్పుడు కనిపించే కోపమంతా ఒకప్పటి ప్రేమ' అంటూ పోస్టర్ పై రాసిన క్యాప్షన్ క్యూరియాసిటీ క్రియేట్ చేస్తోంది. మైథాలజికల్ యూనివర్స్ బ్యాక్ డ్రాప్ లో రూపొందనున్న ఈ సినిమా ఒక కొత్త ప్రపంచాన్ని ప్రేక్షకులకు చూపించనుంది.

**చేసిందే ఒక్క సినిమా.. దెబ్బకు తెలుగు కుర్రాళ్లను పిచ్చెక్కించేసింది..**

# ఈ కేరళ అందాన్ని గుర్తుపట్టారా.. ?

మలయాళ చిత్ర పరిశ్రమలో తనదైన నటనతో గుర్తింపు తెచ్చుకున్న యువ నటి ఆమె. తెలుగులో ఒక్క సినిమాతోనే సెన్సేషన్ అయ్యింది. కేరళ సంప్రదాయ పండుగ 'విషు' సందర్భంగా తన మధుర జ్ఞాపకాలను అభిమానులతో పంచుకున్నారు. కేరళీయులకు 'విషు' అనేది కేవలం ఒక పండుగ మాత్రమే కాదు, అది ఒక కొత్త ఆరంభం, భావోద్వేగాలతో కూడిన వేడుక. పైన ఫోటోలో కనిపిస్తున్న అమ్మడు గుర్తుందా.. ? ఇటీవల తెలుగులో ఒక్క సినిమాతోనే సెన్సేషన్ అయ్యింది. చేసిందే ఒక్క మూవీ.. కానీ ఊహించని రెస్పాన్స్ అందుకుంది. ఆమె అందమైన కళ్లు.. ఆకట్టుకునే రూపం తెలుగు ప్రేక్షకులను ఆకట్టుకుంది. ముఖ్యంగా కుర్రాళ్ల కలల రాణిగా మారిపోయింది. ఇటీవల తమ విషు పండగ గురించి ఆసక్తకిర కామెంట్స్ చేసింది అనస్వర. తన దృష్టిలో 'విషు' అంటే వంటగది నుండి వచ్చే ఉన్నియప్పం (బియ్యం పిండి, బెల్లంతో చేసే కేరళ స్వీట్) సువాసన, ఇంటి నిండా వెలిగే దీపాల వెలుగులు అని పేర్కొన్నారు. చిన్నప్పుడు పండుగ రోజు ఉదయాన్నే నిద్రలేవగానే అమ్మ వంట చేస్తుంటే వచ్చే ఆ తీపి సువాసన తన పండుగ జ్ఞాపకాల్లో చెరగని ముద్ర వేసిందని ఆమె చెప్పుకొచ్చారు. విషు పండుగలో అత్యంత కీలకమైన 'విషు కని' గురించి ఆమె వివరిస్తూ.. ఉదయాన్నే కళ్ళు మూసుకుని వచ్చి దేవుడి ముందు అమర్చిన పండ్లు, పువ్వులు, బంగారం, అద్దాన్ని చూడటం ఒక అద్భుతమైన అనుభూతి అని అన్నారు. ఆ ఏడాది మొత్తం శుభప్రదంగా గడవాలని కోరుకుంటూ చూసే ఆ దృశ్యం తనకు ఎంతో ఇష్టమని తెలిపారు. ప్రస్తుతం సినిమాలతో బిజీగా ఉండటం వల్ల చిన్నప్పటిలా పండుగను జరుపుకోలేకపోతున్నానని, కానీ ఆ పాత రోజులను తలుచుకుంటే ఇప్పటికీ ఎంతో సంతోషంగా ఉంటుందని అనశ్వర అన్నారు. షూటింగ్ లో ఉన్నప్పటికీ, సంప్రదాయబద్ధమైన 'సద్య' (కేరళ విందు భోజనం) తినడం మాత్రం మర్చిపోనని ఆమె చెప్పారు. కేరళ సంప్రదాయ దుస్తులైన కసవు చీర కట్టుకుని, కుటుంబ సభ్యులతో గడపడం తనకు ఎంతో ప్రశాంతతను ఇస్తుందని ఆమె వెల్లడించారు. మలయాళంలో ఎన్నో సూపర్ హిట్ చిత్రాల్లో నటించి తనదైన ముద్ర వేసింది. బాలనటిగా తెరంగేట్రం చేసిన ఈ అమ్మడు.. ప్రస్తుతం క్రేజీ బ్యూటీ. ఇటీవలే తెలుగులో ఛాంపియన్ సినిమాతో తెలుగు తెరకు పరిచయమైంది. మొదటి చిత్రంతోనే తనకంటూ స్పెషల్ ఇమేజ్ క్రియేట్ చేసుకుంది. ఈ మూవీ తర్వాత తెలుగులో ఆమెకు మరిన్ని అవకాశాలు రావడం ఖాయమని తెలుస్తోంది.



# పోరాడి ఓడిన చెన్నై.. హైదరాబాద్ ఖాతాలో మూడో విక్టరీ..

ఐపీఎల్ 2026లో భాగంగా 27వ మ్యాచ్ లో సన్ రైజర్స్ హైదరాబాద్ జట్టు మూడవ విజయాన్ని నమోదు చేసుకుంది. సన్‌రైజర్స్ హైదరాబాద్ అందించిన 195 పరుగుల లక్ష్యాన్ని ఛేదించడంలో చెన్నై సూపర్ కింగ్స్ తేలిపోయింది. దీంతో నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 184 పరుగులు చేసి 10 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. డెవాల్డ్ బ్రూయిస్ (0), సర్ఫరాజ్ ఖాన్ (25 పరుగులు), రుతురాజ్ గైక్వాడ్ (19 పరుగులు), ఆయుష్ మహాత్రే (30 పరుగులు), సంజు సామ్సన్ (7 పరుగులు) దారుణంగా విఫలయ్యారు. అంతకుముందు టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్ చేసిన ఎస్ఆర్‌హెచ్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 194 పరుగులు



చేసింది. అభిషేక్ శర్మ (59), క్లాసెన్ (59) హాఫ్ సెంచరీలతో రాణించారు. కాగా, మిగతా ప్లేయర్లు విఫలం కావడంతో ఎస్ఆర్‌హెచ్ 200 స్కోరును దాటలేకపోయింది. సీఎస్‌కే బౌలర్లలో జేమి ఓవర్టన్, అన్షుల్ కంబోజ్ తలో 3 వికెట్లు పడగొట్టారు.

**ఇరు జట్లు:** సన్‌రైజర్స్ హైదరాబాద్ ప్లేయింగ్: అభిషేక్ శర్మ, ట్రావిస్ హెడ్, ఇషాన్ కిషన్ (కెప్టెన్), హెన్రిచ్ క్లాసెన్, సలీల్ అరోరా(కీపర్), అనికేత్ వర్మ, నితీష్ కుమార్ రెడ్డి, శివంగ్ కుమార్, ప్రఫుల్ హింగే, సాకిబ్ హుస్సేన్, ఎషాన్ మలింగ.

చెన్నై సూపర్ కింగ్స్ ప్లేయింగ్ : సంజు శాంసన్ (కీపర్), రుతురాజ్ గైక్వాడ్ (కెప్టెన్), సర్ఫరాజ్ ఖాన్, శివమ్ దూబే, డెవాల్డ్ బ్రెవిస్, జామీ ఓవర్టన్, మాథ్యూ షార్ట్, అన్షుల్ కాంబోజ్, నూర్ అహ్మద్, ముఖేష్ చౌదరి, గుర్జప్నీత్ సింగ్.

# ఆర్సీబీకి సొంతగడ్డపై షాక్.. గ్రీన్ జెర్సీలో ఘోర పరాజయం..

ఐపీఎల్ 26వ మ్యాచ్‌లో, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు ఢిల్లీ క్యాపిటల్స్‌కు 176 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. ఈ టార్గెట్‌ను ఢిల్లీ మరో బంతి ఉండగానే ఛేదించింది. ఐపీఎల్ 2026 సీజన్‌లో భాగంగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) కి సొంతగడ్డపై ఘోర పరాభవం ఎదురైంది. చిన్నస్వామి స్టేడియం వేదికగా శనివారం జరిగిన 26వ మ్యాచ్‌లో పటిష్టమైన ఢిల్లీ క్యాపిటల్స్ 6 వికెట్ల తేడాతో ఆర్సీబీపై అద్భుత విజయం సాధించింది. పర్యావరణ పరిరక్షణ సందేశంతో గ్రీన్ జెర్సీలో బరిలోకి దిగిన బెంగళూరు అభిమానులకు సొంతగడ్డపై తీవ్ర నిరాశే మిగిలింది.

**ఆకట్టుకోలేకపోయిన బెంగళూరు బ్యాటర్లు..**

టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 175 పరుగులు మాత్రమే చేయగలిగింది. ఓపెనర్ ఫిల్ సాల్ట్ (63 పరుగులు) మినహా మిగతా బ్యాటర్లు ఎవరూ పెద్దగా రాణించలేదు. స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ కేవలం 19 పరుగులకే పెవిలియన్ చేరి తీవ్రంగా నిరాశపరిచాడు. మిడిలార్డర్‌లో జితేష్ శర్మ దారుణంగా విఫలం కాగా, చివర్లో టిమ్ డేవిడ్ వేగంగా ఆడే ప్రయత్నంలో వికెట్ సమర్పించుకున్నాడు. ఢిల్లీ క్యాపిటల్స్ బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేసి బెంగళూరును భారీ స్కోరు చేయకుండా అడ్డుకున్నారు. ముఖ్యంగా స్పిన్నర్లు అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్ చెరో రెండు వికెట్లు పడగొట్టి బెంగళూరు పతనాన్ని శాసించారు. పేసర్ లుంగీ ఎంగిడి కూడా డెత్ ఓవర్లలో పొదుపుగా బౌలింగ్ చేసి కట్టడి చేశాడు.



**లక్ష్యాన్ని సునాయాసంగా ఛేదించిన ఢిల్లీ**

176 పరుగుల మోస్తరు విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన ఢిల్లీ క్యాపిటల్స్ ఎక్కడా తడబడలేదు. చిన్నస్వామి స్టేడియం పిచ్ బ్యాటింగ్ కు అనుకూలించడంతో ఢిల్లీ బ్యాటర్లు ఆరంభం నుంచే బెంగళూరు బౌలర్లపై విరుచుకుపడుతూ స్కోరు బోర్డును పరుగులు పెట్టించారు. ఓపెనర్లు ఇచ్చిన శుభారంభంతో ఛేదన మరింత సులువైంది. బెంగళూరు బౌలర్లు వికెట్లు తీయడానికి తీవ్రంగా శ్రమించినప్పటికీ, ఢిల్లీ బ్యాటర్లు ఏమాత్రం ఒత్తిడికి గురికాకుండా తమ లక్ష్యం వైపు ధీమాగా సాగారు. ఫీల్డింగ్ లో బెంగళూరు చేసిన కొన్ని పొరపాట్లు కూడా ఢిల్లీకి కలిసొచ్చాయి. చివరకు కేవలం 4 వికెట్లు మాత్రమే కోల్పోయి ఢిల్లీ క్యాపిటల్స్ సునాయాసంగా విజయతీరాలకు చేరుకుని పాయింట్ల పట్టికలో తమ స్థానాన్ని మెరుగుపరుచుకుంది.

**గ్రీన్ జెర్సీలో పరాజయాల పరంపర..**

పర్యావరణ పరిరక్షణ కోసం ఉద్దేశించిన 'గో గ్రీన్' కార్యక్రమంలో భాగంగా ప్రతి ఏడాదీ ఒక మ్యాచ్ లో ఆకుపచ్చ జెర్సీ ధరించడం ఆర్సీబీకి ఆనవాయితీగా వస్తోంది. అయితే, ఈ ప్రత్యేకమైన జెర్సీ బెంగళూరు జట్టుకు అస్సలు కలిసిరావడం లేదని అభిమానులు తీవ్ర నిరాశ వ్యక్తం చేస్తున్నారు. గతంలో పలుమార్లు ఈ జెర్సీలో ఘోర పరాజయాలు మూటగట్టుకున్న ఆర్సీబీ, ఈసారి కూడా అదే సెంటిమెంట్ ను రిపీట్ చేసింది. సొంతగడ్డపై, తమ అభిమానుల మధ్య విజయం సాధించి పాయింట్ల పట్టికలో మెరుగైన స్థానానికి చేరుకోవాలనుకున్న రజత్ పాటిదార్ సేనకు ఈ పరాజయం తీవ్ర ప్రభావం చూపనుంది. ముఖ్యంగా బౌలింగ్ విభాగంలో ఉన్న లోపాలను సరిదిద్దుకుంటే తప్ప రాబోయే మ్యాచ్ లలో బెంగళూరు గెలుపు బాట పట్టడం కష్టమే అని క్రీడా విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. నిలకడలేమిని అధిగమించి ఆర్సీబీ తక్షణమే తమ వ్యూహాలను మార్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రికలో
వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...

భక్తి వాయిస్
బిజినెస్ వాయిస్
సినీ వాయిస్
క్రైం వాయిస్
హెల్త్ వాయిస్
కిసాన్ వాయిస్
తీర్పు వాయిస్
సక్సెస్ వాయిస్
వనిత వాయిస్
కిడ్స్ వాయిస్
తీర్పు వాయిస్

Published and Edited by Khandavelli Sunilkumar on behalf of Viswam Voice. Published from H.No. 8, 3-430/1/20, Near BSNL Office, Ameerpet, Ali Nagar, Yella Reddy Guda, Hyderabad, Telangana - 500016. Printed at Sri Sai Ganga Printers and Publications, D.No. 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District, Andhra Pradesh - 523001.Registration No: TGTEL/26/A1458